శాన్‌ఫ్రాన్సిస్కోలో
స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం

● పెట్టుబడిదారుల సదస్సుకు హాజరు



స్టాలిన్ దంపతులకు స్వాగతం పలుకుతున్న పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ నిమిత్తం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దంపతులకు అపూర్వ స్వాగతం లభించింది. 2030లోగా తమిళనాడును ఒన్ ట్రిలియన్ డాలర్ల మేర ఆర్థిక ప్రగతిని సాధించిన రాష్ట్రంగా మార్చేందుకు కంకణం కట్టుకున్న స్టాలిన్ ఇదివరకే మలేసియా, సింగపూర్, జపాన్, స్పెయిన్, దుబాయ్ తదితర దేశాల్లో పర్యటించి విదేశీ పెట్టుబడులను సమీకరించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రూ. 9.74లక్షల కోట్ల పెట్టుబడులతో 31 లక్షలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ నేపథ్యంలో శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరుగనున్న విదేశీ పెట్టుబడీదారుల సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఈ నెల 27న చెన్నై నుంచి బయలుదేరి వెళ్లారు. దుబాయ్ మీదుగా గురువారం ఉదయం శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకున్న స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌కు ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయంలో అమెరికాలో నివసిస్తున్న ప్రవాస తమిళులు స్టాలిన్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమాల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత డిప్యూటీ రాయబారి శ్రీకర్ రెడ్డి, పరిశ్రమల శాఖమంత్రి టీఆర్‌బీ రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ నగరంలో నివసిస్తున్న తమిళ యువతీయువకులు 'సెమ్మొళియామ్ తమిళ్‌మొళియాం' అంటూ తమిళంలో గానం చేశారు. గురువారం సాయంత్రం ఆ నగరంలో జరిగిన పెట్టుబడిదారుల మహానాడులో స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు గల అవకాశాలు, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను ఆయన వివరించారు. ఇక ఈ నెల 31న శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రవాస తమిళ ప్రముఖులు, తమిళులతో ఆయన భేటీ అవుతారు. ఆ తర్వాత అమెరికాలోని బహుళ జాతి సంస్థల ప్రతినిధులను కలుసుకుంటారు. సెప్టెంబర్ 2న అక్కడి నుంచి చికాగో నగరానికి వెళ్లి సెప్టెంబర్ 12 వరకు బసచేస్తారు. ఆ సమయంలో మరికొన్ని ప్రముఖ కంపెనీల ప్రతినిధులను కూడా ఆయన కలుసుకోనున్నారు. సెప్టెంబర్ 7న చికాగోనగరంలో ప్రవాస తమిళులతో భేటీ అవుతారు. ఆ తర్వాత అమెరికా పర్యటనను ముగించుకుని ఆయన సెప్టెంబర్ 14న చెన్నై తిరిగొస్తారు.



శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం వద్ద ముఖ్యమంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న తమిళ యువతులు

టీఆర్‌ఎస్ శర్మ రచనలు
భావితరాలకు ఆదర్శం

● జాతీయ సదస్సులో వక్తలు



పత్రసమర్పకుల వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న తెలుగు ప్రముఖులు

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహిత్య రాజధాని మదురైలో జన్మించి, ఉద్యోగ రీత్యా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సేవలందించి, ఆ తర్వాత తమిళనాట స్థిరపడిన టీఆర్‌ఎస్ శర్మ కలం నుంచి జాలువారిన రచనలు భావితరాలకు ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. మెరీనా క్యాంపస్ రజోత్సవ ప్రాంగణంలో తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ గురువారం ఉదయం 'టీఆర్‌ఎస్ శర్మ - సాహిత్యం: అవలోకనం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించింది. సదస్సు ప్రారంభ సమావేశంలో హైదరాబాద్ యోగాలయ రీసెర్చ్ సెంటర్ నిర్వాహకులు డా.విశ్వర్షి వాసిలి వసంతకుమార్ కీలోకపన్యాసం చేస్తూ.. మూడేళ్లలో శతవార్షికోత్సవాలను జరుపుకోనున్న తెలుగు శాఖ 93 యేళ్ల టీఆర్‌ఎస్ శర్మ సాహిత్యాన్ని అవలోకించుకోవడం అపూర్వఘట్టమని కొనియాడారు. అక్షరం ఏనాడూ అబద్ధం చెప్పదని, తమిళ, తెలుగు, ఆంగ్ల, సంస్కృత భాషల్లో రచనలు చేసిన శర్మ రచనలు అక్షర సత్యాలని, ఆయన సాహితీ నిరంతరాన్వేషి అని పేర్కొన్నారు.. ఈ సదస్సులో 45 మంది ఆయన సాహిత్యంపై పత్ర సమర్పణలు చేయడం అభినందనీయమన్నారు. ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ.. తెలుగులో 34, తమిళంలో 14, ఆంగ్లంలో 4 రచనలు చేసిన శర్మ సాహిత్యంపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్య అతిథి అలేఖ్య లెదర్స్ అధినేత నర్రావుల వేంకటరమణ పత్ర సమర్పకుల వ్యాససంపుటిని ఆవిష్కరించి తొలి ప్రతిని తమిళనాడు తెలుగు సాంస్కృతి సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వేంకటరమణ మాట్లాడుతూ శర్మతో తనకు రెండు దశాబ్దాల పరిచయం ఉందని, ఆయన రచనలను జాతీయ స్థాయిలో వెలుగులోకి తీసుకువచ్చేలా మద్రాసు వర్శిటీ తెలుగు శాఖ జాతీయ సదస్సు నిర్వహించడం హర్షణీయమన్నారు. గౌరవ అతిథి రాజధాని కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు డా.ఎ. ఆంబ్రూణి ప్రసంగిస్తూ.. శర్మ రచనలు ఎన్నో సామాజికాంశాలను ప్రస్తావిస్తాయని చెప్పారు. డా. పాండురంగం కాళియప్ప స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సమావేశం డా. మాదా శంకరబాబు వందన సమర్పణతో ముగిసింది. ఆ తర్వాత 'అఱత్తుప్పై' (ధర్మసూక్తులు) అనే అంశంపై జరిగిన సమావేశానికి కవి, రచయిత్రి డా. తిరుమల ఆముక్తమాల్యద అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎస్.వసుంధరాదేవి, నారగోని సైదులు, గద్దల అనిల్, ఎస్ శశికళ, వి.రత్నసభాపతి, గ్లోరీ, పి.బాలముని శివకుమార్ ప్రసంగించారు. రాజధాని కళాశాల అధ్యాపకులు డా.మామిడి మురళి అధ్యక్షతన జరిగిన రెండో సమావేశంలో యడవల్లి అరుణ శ్రీనాథ్, బి. జ్యోషి ప్రశాంతి, ఆచార్య ఆర్.నారాయణన్, వి.వెంకటేశన్, అన్నపూర్ణ బత్తుల, డా. కొణిదల శోభ, షేక్ జరీనా ప్రసంగించారు. భోజన విరామానంతరం డా. పట్టపు శివకుమార్ అధ్యక్షతన మూడో సమావేశం, డా. మాదా శంకరబాబు అధ్యక్షతన నాలుగో సమావేశంలో పత్ర సమర్పకులు ప్రసంగించారు.

తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి టీఆర్‌ఎస్...

సాయంత్రం ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన సమాపనోత్సవం జరిగింది. ముఖ్య అతిథి రెప్కో బ్యాంక్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య మాట్లాడుతూ శర్మతో యేళ్లతరబడి సన్నిహిత సంబంధాలున్నాయని, ఆయన ఓ రుషి వంటివారని, ఈ వయస్సులో సైతం గొప్ప రచనలు చేయడం సంతోషదాయకమన్నారు. విశిష్ట అతిథి, జనని అధ్యక్షులు డాక్టర్ నిర్మలా పళనివేలు మాట్లాడుతూ.. బహుభాషాకోవిదుడైన శర్మ రచనలపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథి, మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ తన ప్రసంగంలో ఆధ్యాత్మికం, సమాజహితం కోరుతూ శర్మ రచనలు చేశారని, తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి ఆయనేనని కొనియాడారు. రాజధాని కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి సమాపనోత్సవ సందేశం ఇస్తూ శర్మ సులభశైలిలో రచనలు చేసి పండిత పామరుల ప్రశంసలందుకున్నారని తెలిపారు. ఎస్.శశికళ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సమావేశం పసల చైతన్యకుమార్‌రెడ్డి వందన సమర్పణతో ముగిసింది.

పతాకావిష్కరణతో ప్రారంభమైన
వేలాంకన్ని వార్షికోత్సవాలు



బీసెంట్‌నగర్ వేలాంగన్ని ఆలయం వద్ద పతాకావిష్కరణకు హాజరైన భక్తులు

ప్యారీస్, ఆగస్టు 29: నాగపట్టణం జిల్లా వేలాంకన్నిలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన సెయింట్ ఆరోగ్యమాత వార్షికోత్సవాలు గురువారం సాయంత్రం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. తంజావూరు బిషప్ టి.సహాయరాజ్ తంబురాజ్ ప్రత్యేక ప్రార్థనలతో సాయంత్రం 5.45 గంటలకు అమ్మవారి చిత్రపటంతో రూపొందించిన పతాకాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం లక్షలాది మంది భక్తుల కరతాళధ్వనుల మధ్య బిషప్ పతాకం ఆవిష్కరించి 11 రోజుల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో చర్చి ఫాదర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన బిషప్‌లు పాల్గొని, విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లక్షలాది మంది భక్తులతో వేలాంకన్ని దివ్యక్షేత్రం కిటకిటలాడుతోంది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భక్తులకు తగిన సదుపాయాలు కల్పించారు. రద్దీలో దొంగల బారిన పడకుండా భక్తులు జాగ్రత్తగా చూసుకోవాలని అలాగే, పిల్లలు తప్పిపోకుండా అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

బీసెంట్‌నగర్‌లో...

అడయార్ సమీపంలోని బీసెంట్‌నగర్ సెయింట్ వేలాంకన్ని చర్చిలో మైలాపూర్ బిషప్ జార్జి అంథోని పతాకం ఆవిష్కరించి వార్షికోత్సవాలను ప్రారంభించారు. సెప్టెంబరు 8వ తేది వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ఎంటీసీ ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి అదనంగా సిటీ బస్సులు నడుపనుంది. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే పాదయాత్రగా బీసెంట్‌నగర్‌కు చేరుకొని పతాకావిష్కరణలో ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



హైకోర్టు మదురై ధర్మాసనం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ ఆస్పత్రి భవనాల నిర్మాణం వ్యవహారంలో కేంద్రప్రభుత్వ అలసత్వాన్ని హైకోర్టు గట్టిగా నిలదీసింది. ఈ వ్యవహారంలో గత ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని నిగ్గదీసింది. కరోనా లాక్‌డౌన్ వల్ల ఎయిమ్స్ నిర్మాణ పనుల్లో జాప్యం

ఐదేళ్లలో ఏం చేశారు?

● మదురై ఎయిమ్స్ ఎప్పటికి పూర్తి చేస్తారు?

● కేంద్రాన్ని నిలదీసిన హైకోర్టు

జరిగిందన్న వాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. లాక్‌డౌన్‌కు ముందు, దాని తరువాత ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని సూటిగా ప్రశ్నించింది. ఇంతకీ ఎయిమ్స్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో సమగ్ర వివరాలు తమ ముందుంచాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సుబ్రమణియన్, జస్టిస్ విక్టోరియా గౌరితో కూడిన హైకోర్టు మదురై ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎయిమ్స్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంద ని, ఈ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ మదురైకి చెందిన భాస్కర్ అనే వ్యక్తి వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మదురై ఎయిమ్స్ ఏర్పాటుతో వేలాది మందికి ఉద్యోగాలు లభించడంతో పాటు దక్షిణ తమిళనాడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందే అవకాశముందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం. 2015లో తమిళనాడులో ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటుచేయాలని నిర్ణయించిందని, 2018లో మదురై ఎయిమ్స్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు జరుగలేదని, దీర్ఘకాలంగా ఈ నిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. నిర్మాణ పనులు సత్వరం ముగించాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పలు పిటిషన్లు దాఖలయ్యాయని, వాటిని విచారించిన న్యాయస్థానం పలురకాల తీర్పులు ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదని తెలిపారు. మదురై తోప్పూరులో ఎయిమ్స్ నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించామని, పనులు ప్రారంభించి 2026లోగా పూర్తిచేస్తామని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది తెలిపారు. కరోనా కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని వివరించారు. ఆయన వాదనల్ని తోసిపుచ్చిన ధర్మాసనం.. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సెప్టెంబరు 24వ తేదీకి వాయిదా వేసింది.

ఫార్ములా-4 కార్ రేస్‌కు
హైకోర్టు గ్రీన్ సిగ్నల్

పెరంబూర్, ఆగస్టు 29: నగరంలో ఫార్ములా-4 కార్ రేస్ నిర్వహణపై ఎలాంటి నిషేధం విధించలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. ఐల్యాండ్ గ్రౌండ్ చుట్టూ 3.5 కి.మీ మేర ఫార్ములా 4 కారు పందేలు ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేది జరుగుతున్నట్లు ప్రకటించారు. రాత్రి వేళ విద్యుద్దీపాల వెలుగుల్లో నిర్వహించనున్న ఈ పోటీలకు వచ్చే సందర్శకుల కోసం 8,000 సీట్లు ఏర్పాటు చేశారు. అలాగే, రేస్ జరిగే ప్రాంతంలో భద్రతా దృష్ట్యా ఇనుప కంచెలు ఏర్పాటుచేయడంతో పాటు రేస్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, కార్ రేస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నేత ఏఎన్ఎస్ ప్రసాద్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ గురువారం ఉదయం విచారించిన న్యాయస్థానం, ఫార్ములా-4 కార్ రేస్‌కు సంబంధించి చేపట్టిన భద్రతా చర్యలపై రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని, ఈ పోటీల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేసిన అనంతరం, తీర్పు సాయంత్రానికి న్యాయస్థానం వాయిదావేసింది. సాయంత్రం ఈ పిటిషన్ తీర్పు వెలువరించిన న్యాయస్థానం.. ఫార్ములా-4 కారు పందేలకు ఎలాంటి నిషేధం విధించలేమని తెలిపింది. అలాగే, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి, బస్టాండు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలకు వెళ్లే ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా చర్యలు చేపట్టాలని సూచించింది. అలాగే, ఎఫ్ఐఏ అంతర్జాతీయ సర్టిఫికెట్ లేకుండా ఫార్ములా-4 కార్ రేస్ నిర్వహించరాదని ఆదేశిస్తూ.. ఆ సర్టిఫికెట్ లేకుండా పోటీలు నిర్వహిస్తే కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన కేసు దాఖలుచేయవచ్చని పిటిషనర్లకు సూచించింది.



రూ.26 కోట్లతో
వాకింగ్ ట్రాక్‌లు

●చెన్నై కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న మేయర్ ప్రియ, చిత్రంలో డిప్యూటీ మేయర్, కమిషనర్

అడయార్, ఆగస్టు 29: స్థానిక తేనాంపేట సహా నాలుగు జోన్లలో రూ.26 కోట్లతో 16 చోట్ల వాకింగ్ ట్రాక్‌లను నిర్మించనున్నారు. ఈ మేరకు గురువారం జరిగిన చెన్నై నగర పాలక సంస్థ సమావేశంలో తీర్మానం చేశారు. మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఎం.మహేష్, కమిషనర్ కుమారగురుబరన్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేసిన పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశం ప్రారంభంకాగానే వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో మరణించిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన కార్పొరేటర్లు సంతాపం తెలపడంతో పాటు తమ వేతనంలో కొంతభాగం కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత పలు తీర్మానాలు చేశారు. ఇందులోభాగంగా, కార్పొరేషన్‌లో 289 చెత్త తొలగించే వాహనాలకు రూ.1.31 కోట్లతో జీపీఎస్ పరికరాలు అమర్చి, మూడేళ్ళపాటు వాటి నిర్వహణ బాధ్యతలు ఆ కంపెనీయే చూసేలా తీర్మానం చేశారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 9, 12 జోన్లలో 16 ప్రాంతాల్లో రూ.26.60 కోట్లతో వాకింగ్ ట్రాక్‌లు నిర్మించే తీర్మానాన్ని ఆమోదించారు. పెరంబూరులోని మురసొలి మారన్ పార్కులో రూ.5.75 కోట్లతో సైన్స్ పార్క్ నిర్మించేందుకు ఈ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అన్నానగర్ ఈస్ట్ 2వ ప్రధాన రోడ్డుకు కవి అవ్వై నటరాజన్ ప్రధాన రహదారి అని పేరుపెడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో ఈ పేరు మార్పునకు కూడా ఆమోదం తెలిపింది. కన్నప్పర్ మైదానం ప్రాంతంలో నివసించే 114 కుటుంబాలకు తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు (టీయుహెచ్‌డీబీ) తరఫున ఇళ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఇందుకోసం లబ్ధిదారుడి నుంచి మూడింట ఒక వంతు, రెండొంతులు చెన్నై కార్పొరేషన్ చెల్లించేలా తీర్మానం చేశారు. జీసీసీ పరిధిలో రూ.9.45 కోట్లతో యేడాదికి 50 వేల కుక్కలకు కు.ని. పథకానికి కూడా ఆమోదం తెలిపింది. అదేవిధంగా చెన్నై నగరంలో రూ.8.46 కోట్లతో 81 ప్రాంతాల్లో కొత్త బస్టాపులను నిర్మించడంతో పాటు మొత్తం 54 తీర్మానాలకు కౌన్సిల్ సమావేశం ఆమోదముద్ర వేసింది.



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

సమాచార దర్శిని

పసుపు సంచులు తయారుచేస్తే రూ.లక్ష బహుమతి

ఐసిఎఫ్, ఆగస్టు 29: పసుపు సంచులు తయారుచేసే సంస్థలకు రూ.లక్ష బహుమతి అందజేయనున్నట్లు కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. పర్యావరణానికి అనుకూలమైన విధానంలో రూ.5లకే నాణ్యమైన పసుపు సంచుల తయారీకి 'బాగథాన్' పోటీలు జరుగనున్నాయి. వీటిలో పాల్గొనాలని కొత్త సంస్థలకు కాలుష్య నియంత్రణ బోర్డు ఆహ్వానం పలికింది. గెలుపొందే సంస్థలకు రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు నగదు బహుమతి అందజేయనుంది. ఔత్సాహికులు form.startuptn.in/bagathon అనే వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 5వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలి.

రేపు పనిచేయనున్న రేషన్ దుకాణాలు

ఐసిఎఫ్, ఆగస్టు 29: రేషన్ దుకాణాలు శనివారం యధావిధిగా పనిచేయనున్నాయి. అన్ని రేషన్ దుకాణాల్లో నెలాఖరు రోజున వస్తువుల విక్రయాలు నిలిపివేస్తుంటారు. ఈ నెల రేషన్ కార్డుదారులు లబ్ధిపొందేలా ఈనెల 31న దుకాణాలు తెరచి ఉంచాలని, ఇప్పటివరకు సరుకులు పొందని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆహారశాఖ అధికారులు తెలిపారు.

రూ.10 కోట్లతో కోయంబేడు మార్కెట్ అభివృద్ధి

ఐసిఎఫ్, ఆగస్టు 29: స్థానిక కోయంబేడు మార్కెట్ అభివృద్ధి పనులు రూ.10 కోట్లతో చేపట్టనున్నారు. కూరగాయలు, పండ్లు, పూవుల దుకాణాలతో కూడిన ఈ మార్కెట్లో సీసీ కెమెరాలు, విద్యుద్దీపాలు, ఆర్చిలు, గోడలకు పెయింటింగ్ చేపట్టేందుకు సీఎండీఏ రూ.10 కోట్లు కేటాయించింది. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకానికి సబ్సిడీ

ఐసిఎఫ్, ఆగస్టు 29: పుట్టగొడుగుల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ అందజేయనుంది. రాష్ట్రంలో ఆహారానికి వినియోగించే పుట్టగొడుగుల పెంపకం వ్యవసాయ సాగు కిందకు వచ్చింది. ఇటీవల వీటి వినియోగం పెరగడంతో పుట్టగొడుగులు పెంచే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ సంస్థలు కూరగాయల జాబితాలో పుట్టగొడుగులను చేర్చాయి. దీంతో వ్యవసాయ శాఖ పుట్టగొడుగుల పెంపకానికి సబ్సిడీ అందజేయనున్నట్లు ప్రకటించింది.

ఫిట్టర్ కోర్సులో చేరేందుకు అవకాశం

ఐసిఎఫ్, ఆగస్టు 29: స్థానిక గిండి, నాగర్‌కోయిల్, ఉళుందూర్‌పేటలో ఉన్న ఐటీఐల్లో ఫిట్టర్ కోర్సులో చేరేందుకు అంధులు, బధిరులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిట్టర్ శిక్షణకు సంబంధించిన అడ్మిషన్లు ముగిసిన నేపథ్యంలో, శనివారం వరకు నేరుగా వెళ్లి చేరవచ్చని అధికారులు తెలిపారు. వివరాలకు 9499055689 అనే నెంబరు సంప్రదించవచ్చు.

వాటర్ బోర్డు కార్యాలయ చిరునామా మార్పు

ఐసిఎఫ్, ఆగస్టు 29: చెన్నై మెట్రోవాటర్ బోర్డు డిపో కార్యాలయం-38 చిరునామా మారింది. తండయార్‌పేట మండల పరిధికి చెందిన సుందరంపిళ్లై నగర్‌లోఉన్న ఈ కార్యాలయం శుక్రవారం నుంచి అదే ప్రాంతంలోని పటేల్ నగర్ నీటి సరఫరా కేంద్రం సమీపంలోకి మారింది. ఇతర వివరాలకు 8144930038, 8144930210 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

కొత్త తాలూకాగా కొళత్తూర్

ఐసిఎఫ్, ఆగస్టు 29: చెన్నై జిల్లాలో అయనావరం తాలూకాలో ఉన్న కొళత్తూర్ పెరవళ్లూర్, సిరువళ్లూర్ గ్రామాలతో కొత్త తాలూకా ఆవిర్భవించింది. ఈ తాలూకాకు అయనావరం తాలూకా నుంచి బదిలీ ద్వారా ఏడు పోస్టులు కేటాయించారు. కొత్తగా 35 పోస్టులు రూపొందించారు. ఈ పోస్టులను ఓపెన్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ తాలూకాకు ఏడాది ఖర్చులకు రూ.2.91 కోట్లు కేటాయించారు.

ఉచిత చీర, ధోవతి పథకానికి రూ.100 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 29: రానున్న పొంగల్ సందర్భంగా చీర, ధోవతి పథకానికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. పొంగల్ సందర్భంగా రాష్ట్రంలోని రేషన్‌కార్డుదారులకు 1.77కోట్ల చీరలు, 1.77 కోట్ల ధోవతులు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందజేయనున్నారు. ఈ పథకానికి రూ.100 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, ఆగస్టు 29: సేలం జిల్లా మేట్టూరు డ్యాం ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారం సాయంత్రం డ్యాంకు 4,551 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, గురువారం ఉదయం 4,284 ఘనపుటడుగులకు తగ్గింది. డెల్టా సాగు కోసం12,000 ఘనపుటడుగులు, ఉత్తర, దక్షిణ కాల్వలకు 700 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 87.93 టీఎంసీల నీటినిల్వలున్నాయి.

ఒక వెబ్‌సైట్ ద్వారా ఐదు సేవలు

ఐసిఎఫ్, ఆగస్టు 29: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఎవరి ప్రమేయం లేకుండా ఒక వెబ్‌సైట్ ద్వారా ఐదు రకాల సేవలను రాష్ట్రప్రభుత్వం అందించనుంది. ప్రభుత్వం అందించే సేవలు 100 శాతం ఆన్‌లైన్‌లో ఉన్నాయి. అయితే ప్రజలకు వీటిపై అవగాహన లేకపోవడంతో కొన్ని సేవలను నగదు చెల్లించి పొందుతున్నారు. ఆస్తి పన్నుల చెల్లింపు, తాగునీటి పన్నులు, విద్యుత్ కనెక్షన్లు, భూములకు సంబంధించిన సమస్యలు, కేసులు వంటి వాటిని ఒకే వెబ్‌సైట్ ద్వారా పొందేలా https://clip.tn.gov.in/ clip/index.html అనే వెబ్‌సైట్‌ను ప్రభుత్వం పరిచయం చేసింది. ఈ వెబ్‌సైట్ ఒకటి, రెండు నెలల్లో అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు.

2,997 దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, ఆగస్టు 29: నగరంలో మూడు నెలల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 2,997 దుకాణాలకు అధికారులు సీలు వేసి, రూ.7.26 కోట్ల జరిమానా విధించారు. రాష్ట్రంలో గుట్కా, పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిషేధం ఉంది. గత మూడు నెలల్లో 40,730 కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకొని, 5,006 కేసులు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల నివేదిక ఆధారంగా ఆహార భద్రతా శాఖ అధికారులు 2,997 దుకాణాలు సీలు వేయడంతో పాటు రూ.7.26 కోట్ల జరిమానా విధించారు.

సీమాన్‌పై కేసు నమోదు చేయండి

పెరంబూర్, ఆగస్టు 29: నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్‌పై కేసు నమోదుచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పోలీసులకు సిఫారసు చేసింది. ఒక వర్గాన్ని కించపరిచేలా 'ఛండాలుడా' అనే పదం వియోగించిన సీమాన్‌పై కేసు నమోదుచేసి, విచారించాలని ఆవడి పోలీస్ కమిషనర్‌కు కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

జాతీయ హజ్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే హసన్ మౌలానా

ఐసిఎఫ్, ఆగస్టు 29: జాతీయ హజ్ కమిటీ సభ్యుడిగా వేళచ్చేరి ఎమ్మెల్యే హసన్ మౌలానా ఎంపికయ్యారు. ఈ పదవికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అయిన హసన్ మౌలానా పోటీచేయగా, ఆయనకు ప్రత్యర్థిగా ఎవరూ పోటీచేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడు, కేరళ హజ్ కమిటీ 6వ మండల సభ్యులుగా ఆయన ఎంపిక కావడం గమనార్హం.

కేసరి పాఠశాలలో ఘనంగా గిడుగు జయంతి

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషాదినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గిడుగు చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏఎస్ గీతాంజలి నేతృత్వంలో జరిగిన ఈ వేడుక సందర్భంగా విద్యార్థులకు ఆంగ్ల పదాలకు తెలుగు అనువాద పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



మాతృభాషా దినోత్సవంలో చిన్నారులు, ఉపాధ్యాయులు

మూడు జిల్లాల్లో పాఠశాలలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, ఆగస్టు 29: ఈరోడ్, సేలం, తిరుచ్చి జిల్లాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలలకు గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. దీంతో, ఆయా పాఠశాలలకు సెలవు ప్రకటించగా, బాంబ్ స్క్వాడ్ పాఠశాల, ప్రాంగణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈరోడ్ జిల్లా సేనాధిపతి పాళయంలోని ప్రైవేటు పాఠశాల, సేలం, జిల్లాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయమై పాఠశాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. బాంబు బెదిరింపు వార్త దావానంలా వ్యాపించడంతో తల్లిదండ్రులు పాఠశాలల్లకు చేరుకొని తమ పిల్లలను తీసుకెళ్లారు. పోలీసులు, బాంబు స్క్వాడ్ పాఠశాలలకు చేరుకొని క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. బాంబు బెదిరింపులు మెసేజ్ వచ్చిన ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందని సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు. కాగా, ఈ మూడు పాఠశాలలు ఒకే విద్యాసంస్థకు చెందినవి కావడం గమనార్హం.



పాఠశాలలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, బాంబ్ స్క్వాడ్

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



వేలూరు, ఆగస్టు 29: అగర్వాల్ కంటి ఆస్పత్రి, ఊరేసు కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.పెరుమాళ్ గోపినాథ్, డా.ఐజక్ అబ్రహాంరాయ్, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ అన్నాసాలై, ఆరణి రోడ్డు మీదుగా సాగి మళ్లీ కళాశాలకు చేరుకుంది.

కరాటే విజేతలకు బహుమతుల ప్రదానం



వేలూరు, ఆగస్టు 29: గుడియాత్తం సమీపం సెన్‌డ్రాన్‌పల్లిలోని అబిరామి స్కూల్‌లో కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. గుడియాత్తంకు చెందిన కరాటే మాస్టర్ ఎంఎస్ కుమారవేల్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో 5 జిల్లాలకు చెందిన సుమారు 500 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ విజేతల బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అబిరామి స్కూల్ ఛైర్మన్ జ్యోతికుమార్, జిల్లా కరాటే సంఘం అధ్యక్షుడు సెన్‌సాయి ఎం, షేక్ అబ్దుల్లా, జిల్లా టెక్నికల్ ప్రముఖుడు వినోద్‌కుమార్, రాణిపేట కరాటే సంఘం అధ్యక్షుడు మారిముత్తు, రాణిపేట జిల్లా కోశాధికారి గణేష్, పారిశ్రామికవేత్త దినకరన్, కార్తి తదితరులు హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

14, 15 తేదీల్లో వినాయక విగ్రహాల ఊరేగింపు

● నగరంలో ఐదు చోట్ల నిమజ్జనం



చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా నగరంలో, సబర్బన్ ప్రాంతాల్లో ఏర్పాటుచేసే విగ్రహాలను సెప్టెంబర్ 14, 15 తేదీల్లో ఊరేగించేందుకు చెన్నై పోలీస్ శాఖ ఏర్పాట్లు చేపట్టింది. 17 మార్గాల్లో విగ్రహాల ఊరేగింపు జరుగుతుందని, చివరకు సముద్రతీరంలో ఐదు చోట్ల నిమజ్జనం చేయవచ్చని పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రమంతటా సెప్టెంబర్ 7 వినాయకచవితి వేడుకలు జరుగనున్నాయి. ఆ సందర్భంగా రాష్ట్రమంతటా సుమారు లక్షకు పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. నగరంలో సుమారు 1500 విగ్రహాలు పెట్టే అవకాశం ఉందని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. చెన్నై, తాంబరం పోలీసు కమిషనరేట్ పరిధిలో నాలుగు చోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఆ మేరకు పట్టినంబాక్కం శీనివాసపురం, నీలాంగరై పళకలై నగర్, కాశిమేడు చేపలరేవు ప్రాంతం, తిరువొత్తియూరు పాపుల్ వేయింగ్ మిషన్ ప్రాంతంలో, ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎన్నూరు రామకృష్ణనగర్ సముద్రతీరంలో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. విగ్రహాల ఊరేగించేందుకు పోలీసులు 17 మార్గాలను ఎంపిక చేశారు. ఈ మార్గాల్లోనే విగ్రహాల ఊరేగింపునకు అనుమతిస్తామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఆ ప్రకారం నుంగంబాక్కం, చింతాద్రిపేట, ఎగ్మూరు, పుదుపేట, పెరంబూరు, వ్యాసార్పాడి, పుళియంతోప్పు, పట్టాలం, వడపళని, సైదాపేట, విల్లివాక్కం, కోయంబేడు, అరుంబాక్కం తదితర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను పట్టినంబాక్కం శీనివాసపురం సముద్రతీరంలో నిమజ్జనం చేసేందుకు అనుమతిస్తామని తెలిపారు. ఇదే విధంగా వాషర్‌మెన్‌పేట, కొడుంగయూరు, ఆర్కేనగర్, మింట్‌స్ట్రీట్, రాయపురం, తండయార్‌పేట ప్రాంతాల్లోని విగ్రహాలను కాశిమేడు చేపలరేవు సముద్రతీరం వద్ద, తిరువొత్తియూరు పరిసర ప్రాంతాల్లో విగ్రహాలను తిరువొత్తియూరు పాపలర్ వేయింగ్ మిషన్ సమీపంలోని సముద్రతీరంలో, రెడ్‌హిల్స్ డిప్యూటీ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎన్నూరు, చుట్టుపక్కలి ప్రాంతాల్లో పెట్టే విగ్రహాలను ఎన్నూరు రామకృష్ణ నగర్ సముద్రతీరంలో నిమజ్జనం చేసేందుకు అనుమతిస్తారు. ఈ వినాయక విగ్రహాల నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు.

మదురై సహా నాలుగు నగరాల్లో బీఈడీ ప్రశ్నపత్రం లీక్

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం నిర్వహించాల్సిన బీఈడీ సెమిస్టర్ పరీక్ష ప్రశ్నపత్రం బుధవారమే మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, తూత్తుకుడి నగరాల్లో లీక్ అయింది. ఈ ప్రశ్నపత్రం రూ.2000లకు అమ్ముడైనట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన బీఈడీ సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా లీక్ అయినట్లు చెబుతున్నప్పటికీ అధికారులు ఆ విషయాన్ని నిర్ధారించలేదు. గురువారం జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం ముందే లీక్ కావటంతో విద్యాశాఖ అధికారులు బుధవారం రాత్రే ప్రత్యామ్నాయ ప్రశ్నపత్రాలను అన్ని కేంద్రాలకు పంపారు. దీంతో కొత్త ప్రశ్నపత్రంతో గురువారం పరీక్షలు నిర్వహించారు. బీఈడీ ప్రశ్నపత్రం ధర్మపురి, తూత్తుకుడి, మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, దిండుగల్ జిల్లాలోనూ లీక్ అయినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో బీఈడీ కోర్సులను కేరళకు చెందిన విద్యార్థులు అధికసంఖ్యలో చదువుతున్నారని, ఆ అభ్యర్థుల ద్వారానే ఈ ప్రశ్నపత్రం లీక్ అయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. బీఈడీ సెమిస్టర్ పరీక్షపత్రాలు లీక్ అయినట్లే ఎంఈడీ సెమిస్టర్ పరీక్ష పత్రాలు లీక్ అయిందేమోనని అధికారులు విచారణ ప్రారంభించారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటూ బాధితుల వినతి



కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న బాధితులు

వేలూరు,ఆగస్టు 29: స్థానిక కొనవట్టమ్ దేవి నగర్‌లో 80 ఏళ్లుగా 42 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు ఇంటి పన్ను, విద్యుత్, కొళాయి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించే వారు అధికంగా దినసరి కూలీలే. ఈ నేపథ్యంలో, ఈ స్థలం ప్రజాపనుల శాఖకు సొంతమని, అందువల్ల ఖాళీ చేయాలంటూ ఆ ప్రాంత వాసులకు అధికారులు నోటీసులిచ్చారు. ఈ విషయమై గురువారం ఆ ప్రాంత ప్రజలు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మూడుతరాలుగా ఇదే ప్రాంతంలో ఉంటున్నామని, తమ పిల్లలు కూడా ఇక్కడి పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. ఉన్నఫలంగా వెళ్లిపోవాలంటే ఎక్కడికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. అందువల్ల ప్రభుత్వమే తమకు స్థలం కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.

గుడియాత్తం లయన్స్ క్లబ్ వితరణ



వేలూరు, ఆగస్టు 29: గుడియాత్తం లయన్స్ క్లబ్ తరఫున రూ.లక్ష విలువైన సహాయాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి గుడియాత్తం నగర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాబు అధ్యక్షత వహించగా, సెక్రటరీ నమశ్శివాయం, కేజీ నాయుడు, ఎం.కార్తికేయన్, ఉదయకుమార్, వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రీజర్ బాక్స్, ఒకరికి ట్రై సైకిలు, ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులు, పేదరికంతో ఉన్న మహిళకు బియ్యం బస్తా, సన్యాసులకు కాషాయ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నిర్వాహకులు అవై అధ్యక్షుడు శివశక్తి, గోపాల్, గిరిధర్‌బాబు తదితరులు పాల్గొనగా, లయన్స్ కోశాధికారి సురేష్‌కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

నగల చోరీ కేసులో మహిళా సీఐ అరెస్టు

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థల కారణంగా విడిపోయిన దంపతుల కేసు విచారణ సందర్భంగా నగలు స్వాధీనం చేసుకుని వాటిని తాకట్టుపెట్టిన మహిళా సీఐని పోలీసులు అరెస్టు చేశారు. మదురై జిల్లా తిరుమంగళం ప్రాంతంలో రాజేష్, అభినయ అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. రాజేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ మనస్పర్థల కారణంగా విడిపోయి తిరుమంగళం మహిళా పోలీసుస్టేషన్‌లో పరస్పరారోపణలతో ఫిర్యాదు చేశారు. ఈ కేసును మహిళా సీఐ గీతా విచారణ జరిపినప్పుడు అభినయ తన భర్తకు కట్నకానుకల కింద ఇచ్చిన 95 సవర్ల నగలను ఇప్పించాలంటూ కోరారు. ఆమె కోరిక మేరకు రాజేష్ నుంచి సీఐ గీత నగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే నెలలు గడించిన ఆ నగలను అభినయకు తిరిగివ్వలేదు. దీనిపై అనుమానం రావటంతో రాజేష్ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా సీఐ గీత ఆ నగలను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రూ.43 లక్షలకు తాకట్టుపెట్టి ఆ డబ్బు సొంతానికి వాడుకున్నట్లు వెల్లడైంది. దీంతో ఆమెను సస్పెండ్ చేయగా, గురువారం పోలీసులు అరెస్టు చేశారు.

గిడుగు భాషా సేవే అసలైన సేవ

● సాహితీవేత్త పాణ్యం దత్తశర్మ

అడయార్, ఆగస్టు 29: గిడుగు రామమూర్తి సవర భాషకు లిపి కనిపెట్టడమే అసలైన భాషా సేవ అని ప్రముఖ సాహితీవేత్త పాణ్యం దత్తశర్మ అన్నారు. పట్టాభిరామ్‌లోని హిందూ కాలేజీలో తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి సంయుక్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన సాహితీవేత్త పాణ్యం దత్తశర్మ పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి కీలకోపన్యాసం చేశారు. భాష మూడు రకాలుగా ఉంటుందని, గ్రాంథికం, శిష్ట వ్యావహారికం, వ్యావహారిక భాషలన్నారు. ఆధునిక సాహిత్యంలో వ్యావహారిక భాషలో ఇపుడెలా ఉందనే వ్యత్యాసాలను ఆయన విద్యార్థులకు వివరించారు. అన్నమయ్య, త్యాగయ్య కీర్తనల్లో ఉన్న తెలుగుదనాన్ని పాటల రూపంలో ఆలపించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముందు అతిథులు, నిర్వాహకులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ స్వాగతం పలకగా, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ జి.కల్విక్కరసి తెలుగు భాషను కాపాడుకోవడం అనేది విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. కాలేజీ సంచాలకుడు డాక్టర్ రాజేంద్ర నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ టి.కల్పన తెలుగు భాషా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించుకోవడం ఇదే తొలిసారని, ఇది ప్రతి సంవత్సరం కొనసాగించాలని కోరారు. డాక్టర్ ప్రమీల వందన సమర్పణ చేయగా, విద్యార్థి ధనుష్ వ్యాఖ్యాతగా వ్యవహరించాడు. అల్లు కుమారి, కీర్తన, శ్వేత ప్రార్థనా గీతాన్ని ఆలపించారు.



గిడుగు రామమూర్తికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

మాంజా దారంపై నిషేధం పొడిగింపు

ఐసిఎఫ్, ఆగస్టు 29: నగరంలో మాంజా దారం విక్రయాలు, వినియోగంపై అక్టోబరు 26వ తేది వరకు చెన్నై పోలీస్ కమిషనర్ నిషేధం పొడిగించారు. మాంజా దారం వినియోగించి గాలిపటాలు ఎగురవేయడంపై నిషేధం అమలులో ఉంది. అలాగే, డ్రోన్లు, పారా గ్లైడర్స్, ఎయిర్ బెలూన్ ఎగురవేయడంపై నిషేధం ఉంది. ఈ నిషేధ గడువు ఇటీవల ముగియడంతో అక్టోబరు 26వ తేది వరకు పొడిగించారు. నిబంధనలు ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఏఎస్పీ పోస్టులు

ఐసిఎఫ్, ఆగస్టు 29: శిక్షణ పూర్తిచేసుకున్న 11 మంది ఐపీఎస్‌లకు సహాయ ఎస్పీ పోస్టులు కేటాయించారు. అంకిత్ అశోక్ కారైక్కుడి, రవీంద్రకుమార్ గుప్తా విల్లుపురం, ఆకాష్ జోషి నామక్కల్, అంజుల్‌నాథర్ మదురై తిరుమంగళం, లలిత్‌కుమార్ నాగర్‌కోయిల్, మదన్ తూత్తుకుడి, మదివానన్ అరుప్పుకోట, సతీష్‌కుమార్ తిరువణ్ణామలై, సృష్టిసింగ్ పొల్లాచ్చి, విగుఅచ్చుమి తాంబరం, అక్షయ్‌అనీల్‌వాగారే హోసూరులో నియమితులయ్యారు. వీరు రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారని అధికారులు తెలిపారు.

వృత్తి లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 29: తాంబరం కార్పొరేషన్ ప్రాంతంలో వృత్తి లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బాలచందర్ తెలిపారు. ఈ కార్పొరేషన్‌లో 5 మండలాల్లో 70 వార్డులుండగా, 10 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. హోటళ్లు, దుకాణాలు, వృత్తి సంస్థలు, జిమ్ వంటివి పనిచేస్తున్నాయి. వీటిలో ఎక్కువగా లైసెన్స్ లేకుండా నడుస్తున్నాయని గుర్తించిన కార్పొరేషన్ అధికారులు ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపారులు, వృత్తులు చేపట్టేవారు https://tnurbanepay.tn.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందాలని, లైసెన్స్ పొందని సంస్థలు, దుకాణాలపై చర్యలు చేపడతామని కమిషనర్ హెచ్చరించారు.

రేపటి నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, ఆగస్టు 29: శ్రీవిల్లిపుత్తూర్ ఆవణి మాసం ప్రదోషం, అమావాస్యను పురస్కరించుకొని చదురగిరి ఆలయానికి శనివారం నుంచి సెప్టెంబరు 3వ తేది వరకు భక్తులను అనుమతించనున్నారు. పశ్చిమ కనుమల్లో ఉన్న సుందర మహాలింగం ఆలయానికి ప్రతినెలా అమావాస్య, పౌర్ణమి, ప్రదోషం రోజుల్లో భక్తులను అనుమతిస్తుంటారు. ఆ ప్రకారం, ప్రదోషం, అమావాస్య సందర్భంగా నాలుగు రోజులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయానికి భక్తులను అనుమతించనున్నారు. ఆ రోజుల్లో వర్షాలు కురిస్తే చదురగిరికి భక్తులు వెళ్లడంపై నిషేధం విధిస్తామని అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

పొలం కౌలుకు తీసుకొని గంజాయి సాగు

● నలుగురి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 29: తేని జిల్లా మేఘమలై అటవీ ప్రాంతంలోని కుళిక్కాడు ప్రాంతంలో పొలాన్ని మూడేళ్లకు కౌలుకు తీసుకొని గంజాయి సాగుచేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తమకు అందిన సమాచారంతో అటవీ, పోలీసు శాఖ అధికారులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి, గంజాయి సాగుచేస్తున్నట్లు గుర్తించారు. పొలాన్ని కౌలుకు తీసుకొని గంజా మొక్కలు పెంచుతున్న కరచ్చిపట్టికి చెందిన మురుగన్, కరుప్పయ్య, అక్కడ పనిచేస్తున్న మేథీవ్, మణిలను అరెస్ట్‌చేసి, గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు.

నాలుగు పట్టణాల్లో కాలుష్య నియంత్రణకు రూ.5 వేల కోట్లు

అడయార్, ఆగస్టు 29: రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలైన చెన్నై, తూత్తుకుడి, మదురై, తిరుచ్చిలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని, దీన్ని నియంత్రించేందుకు రూ.5 వేల కోట్ల మేరకు అవసరమవుతాయని ఓ పరిశోధనలో వెల్లడైంది. ఈ నాలుగు నగరాల్లో గత కొంతకాలంగా వాయు కాలుష్యం పెరిగిపోతోంది. జనావాసాలు, వ్యాపార సముదాయాలు, పరిశ్రామిక ప్రాంతాలు, భవన నిర్మాణ శిథిలాల తొలగింపు ప్రాంతాలు, రవాణా, రహదారులు తదితర ప్రాంతాల్లోని వాయు కాలుష్యంపై అధ్యయనం జరిగింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరిశోధనలో కూడా ఈ నాలుగు పట్టణాల్లో వాయు కాలుష్యం పెరిగిపోయినట్టు తేలింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఈ నాలుగు పట్టణాలకు కలిపి రూ.5 వేల కోట్ల మేర ఖర్చు అవుతాయని ఆ అధ్యయనంలో పేర్కొంది.

బాలికపై అత్యాచారం..ఇద్దరికి 20 యేళ్ల జైలు శిక్ష

అడయార్, ఆగస్టు 29: తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన 14 యేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో దోషులుగా తేలిన ఇద్దరికి 20 యేళ్లజైలు శిక్ష విధిస్తూ నెల్లై పోక్సో ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో మారియప్పన్ (32), శంకర్ అలియాస్ మూర్తి (35) అనే ఇద్దరు ప్రధాన నిందితులు కాగా, ఈ కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు... వివిధ జైలు శిక్షతోపాటు రూ.10 వేల అపరాధం విధిస్తూ తీర్పునిచ్చింది.

కార్మికుడి బ్రెయిన్ డెడ్.. అవయవాల దానం

అడయార్, ఆగస్టు 29: తంజావూరు ప్రభుత్వ వైద్య కాలేజీ, ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన కార్మికుడి అవయవాలను మృతుడి కుటుంబ సభ్యులు దానం చేశారు. జిల్లాలోని మాప్పిళ్లైనాయకన్ పట్టికి చెందిన 52 యేళ్ల ఓ కార్మికుడు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. అయితే, ఆయన ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో కిడ్నీలు, కాలేయం, నేత్రాలు, ఊపిరితిత్తులు, గుండె అవయవాలను సేకరించి వివిధ ఆస్పత్రులకు పంపించారు. పుట్టెడు దుఃఖంలోనూ అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చిన కార్మికుడి కుటుంబ సభ్యులను వైద్యులు అభినందించారు.

విద్యార్థినులను కించపరిచిన ప్రొఫెసర్ బదిలీ

అడయార్, ఆగస్టు 29: తంజావూరు జిల్లా కుంభకోణంలోని ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కాలేజీలో తమిళ విభాగం ప్రొఫెసర్ జయవాణిశ్రీని విద్యాశాఖ అధికారులు బదిలీ చేశారు. ఈ కాలేజీలో చదివే విద్యార్థినులను ఆమె కించపరిచేలా మాట్లాడారు. ఇవి పెనుదుమారాన్ని రేపాయి. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఈ వివాదంపై స్పందించిన ఉన్నత విద్యాశాఖ అధికారులు.. జయవాణిశ్రీని ఈరోడ్ జిల్లా తాలవాడి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీకి బదిలీ చేశారు.

నిధుల కోసం ఢిల్లీలో అధికారుల నిరీక్షణ

ప్యారీస్, ఆగస్టు 29: సమగ్ర సర్వశిక్ష అభియాన్ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.573 కోట్ల నిధుల కోసం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు దేశ రాజధాని ఢిల్లీలో మకాం వేశారు. కేంద్ర ప్రభుత్వం 2018లో పరిచయం చేసిన సర్వశిక్ష అభియాన్ పథకం రాష్ట్రంలో అమలుకు వచ్చింది. ఈ నేపథ్యంలో, తాజాగా ప్రవేశపెట్టిన కొత్త జాతీయ విద్యా విధానానికి ఆమోదం తెలపాలంటూ రాష్ట్రంపై కేంద్రం ఒత్తిడి తెచ్చింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ త్రిభాషా విద్యా విధానానికి ఆమోదించే ప్రసక్తే లేదని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ బుధవారం మీడియా సమావేశంలో తేల్చి చెప్పారు. అందరికీ విద్యా విధానం పథకం కింద 2024-25వ సంవత్సరానికి రూ.3,586 కోట్లు కేటాయించింది. అందులో, కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం, రాష్ట్రప్రభుత్వ వాటా 40 శాతంగా ఉంది. అయితే కేంద్రం తన వాటా రూ.2,152 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.573 కోట్లు గత జూన్‌లో విడుదల చేయాల్సి ఉన్నా ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని మంత్రి ఆరోపించారు. నిధులు కోసం రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు రాసిన లేఖకు సమాధానం లేదు. ఈ నేపథ్యంలో, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మధుమతి నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఢిల్లీలో మకాం వేశారు. వారు కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను సంప్రదించనున్నట్లు సచివాలయం ప్రకటించింది.

కోలాహలంగా కృష్ణ జయంతి వేడుకలు



స్తంభం ఎక్కుతున్న యువకులు

వేలూరు, ఆగస్టు 29: కృష్ణ జయంతి వేడుకల సందర్భంగా నగరంలో జారుడు వృక్షం ఎక్కే వేడుకలు కోలాహలంగా సాగాయి. కాగితపుపట్టరైలో ఉన్న కృష్ణుడి ఆలయ 38వ శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత కృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం నూనె పూసిన వక్షం ఎక్కే కార్యక్రమంలో ఆ ప్రాంతానికి చెందిన యువకులు పాల్గొన్నారు. సుమారు రెండు గంటలు జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

దేశంలోని సుప్రసిద్ధ క్యాథలిక్ చర్చిల్లో వేలాంకన్ని బాసలిక ఒకటి. సుమారు నాలుగు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఈ దివ్యక్షేత్రాన్ని ఏడాది పొడవునా లక్షలాదిమంది భక్తులు సందర్శిస్తుంటారు. 1962 డిసెంబరు 3న ప్రపంచ క్యాథలిక్‌లకు కేంద్రమైన రోమ్ నగరంలోని క్యాథలిక్ మతపెద్ద 23వ పోప్ జాన్ మైకేల్ ఈ క్షేత్రాన్ని బాసలికగా ప్రకటించారు. అప్పటి నుంచి రోమ్‌లో ఉన్న ప్రధాన బాసలికలతో ఈ చర్చిని అనుసంధానం చేశారు. ఈ శుభవార్త ప్రకటించిన అనంతరం నాగపట్టణం జిల్లాలో బంగాళాఖాతం తీరంలో వెలసిన వేలాంకన్ని దివ్యక్షేత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ చర్చి 11 రోజుల వార్షికోత్సవాలు గురువారం సాయంత్రం పతాకావిష్కరణతో ప్రారంభమైన సందర్భంగా ప్రత్యేక కథనం....


- ప్యారీస్

ఆధ్యాత్మికం





వేలాంకన్ని ప్రధాన ఆలయం



400 ఏళ్లుగా ఎండిపోని అవర్ లేడీ ట్యాంక్

మహిమాన్వితం... వేలాంకన్ని దివ్యక్షేత్రం

● 11 రోజుల వార్షికోత్సవాలు ప్రారంభం

పోర్చుగీసు వారు...

17వ శతాబ్దంలో వేలాంకన్ని అమ్మవారి మూడో అద్భుతం జరిగింది. చైనా నుంచి వాణిజ్యం నిమిత్తం పోర్చుగీసు వారు బయల్దేరిన పడవ తుఫానులో చిక్కుకుంది. ఆ పరిస్థితుల్లో వారంతా వేలాంకన్ని అమ్మవారికి తమ గోడు వినిపించుకున్నారు. వెంటనే తుఫాను ప్రళయం తగ్గిపోవడంతో, వారంతా సురక్షితంగా వేలాంకన్ని సముద్రతీరానికి చేరుకున్నారు. ఆ రోజు సెప్టెంబరు 8వ తేది కావడం అమ్మవారి జయంతి పర్వదినం కూడా. అందువల్ల ఆపదలో ఉన్న తమను రక్షించిన వేలాంకన్ని మాతకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ పోర్చుగీసు వ్యాపారులు నిర్మించి ఆలయం ఇప్పటికీ చెక్కుచెదరకుండా గోథిక్ నిర్మాణశైలిలో కనువిందు చేస్తోంది. 1971వ సంవత్సరంలో 81 అడుగుల ఎత్తులో నిర్మించిన ఆలయంలోని శిల్పకళానైపుణ్యాన్ని చూసేందుకు దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. చలువరాళ్ల పీఠంపై చంటిబిడ్డతో ఉన్న వేలాంకన్ని అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి, తలపై బంగారు కిరీటం, చేతిలో బంగారు దండం పొందుపరిచిన పోర్చుగీసు వారు కొన్నేళ్లు ఆలయ నిర్వాహకులుగా కూడా వ్యవహరించారు.

రెండు సార్లు దర్శనమిచ్చిన అమ్మవారు...

వేలాంకన్ని గ్రామంలో ఆరోగ్య వేలాంకన్ని అమ్మవారు పామరులకు రెండు సార్లు దర్శనమిచ్చినట్లు ఆధారాలున్నాయి. 1950లో నాగపట్టణంలోని ఓ జమీందారు ఇంటిలో పుట్టిన శిశువుకు వేలాంకన్ని గ్రామం నుంచి పశువులు మేపుకొనే బాలుడు ప్రతిరోజు పాలు తీసుకెళ్తుండేవాడు. ఒకరోజు పాలు తీసుకెళ్తున్న సమయంలో ఎండకు తట్టుకోలేక ఆ బాలుడు అక్కడ కొలను పక్కన ఓ రావి చెట్టు నీడలో సేదతీరుతాడు. ఆ సమయంలో చంకలో పసిబిడ్డతో కనిపించిన అమ్మవారు తన బిడ్డకు పాలివ్వమని అడగడం, బాలుడు పాలివ్వడం జరుగుతుంది. చంటిబిడ్డ పాలు తాగాక వేలాంకన్ని మాత అక్కడి నుంచి అదృశ్యకావడంతో, కుండలో తగ్గిన పాలతో ఆలస్యంగా వెళ్లిన ఆ బాలుడిని జమీందారు గట్టిగా మందలిస్తాడు. ఆ సమయంలో అందర్నీ ఆశ్చర్యపరిచేలా కుండలో పాలు పొంగి ఇల్లంతా ప్రవహించాయి. ఇది ముమ్మాటికీ వేలాంకన్ని మాత మహిమ అని గ్రహించిన జమీందారు వెంటనే వేలాంకన్ని చేరుకొని స్థానికులతో కలసి బాలుడికి అమ్మవారు దర్శనమిచ్చిన స్థలంలో తాటాకుల గుడిసెతో అమ్మవారికి చిన్న ఆలయం నిర్మించి తన మొక్కు చెల్లించుకున్నాడు. చిన్న గుడిసెగా ఉన్న ఆ ఆలయమే నేడు ఎత్తైన గోపురాలతో అవర్ లేడి ట్యాంక్ సమీపంలోనే కనువిందు చేస్తోంది.



చంటిబిడ్డతో వేలాంకన్ని అమ్మవారి బంగారు విగ్రహం



ఆలయ లోపలి దృశ్యం

రెండవ దర్శనం...

400 ఏళ్ల క్రితం నాగపట్టణం గ్రామ పొలిమేరలో మజ్జిగ అమ్ముకుంటూ ఓ దివ్యాంగ బాలుడు తన కుటుంబానికి సహకరించేవాడు. ఆ దారిన పోయే వారు అతడి అవిటి తనాన్ని హేళన చేసేవారు. ఇలా ఉండగా ఒకనాడు ఆ బాలుడి ముందు చంటిబిడ్డతో ప్రత్యక్షమైన వేలాంకన్ని మేరీమాత, మజ్జిగ తీసుకుని తన చంటిబిడ్డకు తాగించి వరాలు కురిపిస్తుంది. దీంతో, ఆ బాలుడు స్వస్థత పొంది ఉరకలేస్తూ ఉత్సాహంగా పరుగులు తీయడం అద్భుతంగా నేటికి చెప్పుకుంటున్నారు. ఈ మహిమలపై ప్రచారం జరగడంతో వేలాంకన్ని గ్రామాన్ని సందర్శించడానికి రవాణా సౌకర్యం లేని ఆ రోజుల్లో పెద్దసంఖ్యలో భక్తులు వెళ్లినట్లు కథలుగా చెబుతుంటారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో వేలాంకన్ని బాసలిక

నిర్మాణశైలి అద్భుతం...

బంగాళాఖాతం తీరంలో అలల ఘోష రమ్యమైన ప్రకృతి నడుమ గోథిక్ శిల్పకళా నైపుణ్యం, నిర్మాణశైలి వేలాంకన్ని బాసలిక ప్రత్యేకత. ఎత్తైన గోపురాల మధ్య ఆలయ ముఖ ద్వారం చూస్తే చాలు, భక్తి భావం పొంగుతుంది. చర్చి ప్రాంగణంలో 400 ఏళ్లుగా అడుగంటని నీటి బావిని (అవర్ లేడి ట్యాంక్) భక్తులు తిలకిస్తుంటారు. సువిశాల ఈ ఆలయ ప్రాంగణంలో పోర్చుగీసు వారు నిర్మించిన ఆలయ ముందు, చుట్టుపక్కల అవర్ లేడి ట్యాంక్ ఆలయం, నడుకుప్పం ఆలయం, విన్‌మీన్ ఆలయం, యేసు క్రీస్తు 12 మంది శిష్యుల జీవిత విశేషాలు, శిలువ మార్గం దృశ్యాలతో ప్రతిమలున్నాయి. ప్రధాన ఆలయం పక్కనే గ్రంథాలయం, భక్తులు అమ్మవారికి కృతజ్ఞతలు తెలుపుతూ విరాళంగా సమర్పించే కానుకల ప్రదర్శనశాల, పెంపుడు జంతువులు, రకరకాల పక్షులు, క్రైస్తవ మతగురువులు జీవిత విశేషాలు తెలియజేసే హాలు, ధ్యాన మందిరం కళకు అద్దం పడుతున్నాయి. ప్రతి శనివారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్నదాన కార్యక్రమం, వారమంతా ఉచిత వైద్యసేవలు, దివ్యాంగులు, వృద్ధులు, పేదలకు సహాయాల పంపిణీ కొనసాగుతోంది. ఆలయ సందర్శన, అమ్మవారి దర్శనం, ప్రార్థనా కార్యక్రమాలన్నీ ఉచితమే కావడం గమనార్హం.



క్రీస్తు మహాల్

ప్రదర్శనశాలలు...

ఆలయ చరిత్ర తెలుసుకొనేందుకు చర్చి ప్రాంగణంలోనే మూడు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ప్రదర్శనశాలలు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయి. అవర్ లేడి ట్యాంక్ నీటిని భక్తులకు బాటిళ్లలో ఉచితంగా ఇస్తున్నారు. వివిధ దేశాల పర్యాటకులు ఈ చారిత్రాత్మక ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. వీరి సంక్షేమార్థం వేలాంకన్ని మున్సిపాలిటీ పబ్లిక్ టాయిలెట్, శుద్ధీకరించిన తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు సమకూర్చింది. అంతేకాకుండా, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో సమాచార విభాగాలు ఏర్పాటుచేసి వివరాలు తెలియజేస్తుంటారు.

వార్షికోత్సవాలు...

ప్రతి ఏటా ఆగస్టు 29వ తేది సాయంత్రం 5.45 గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభమయ్యే వేలాంకన్ని ఆలయ వార్షికోత్సవాలు సెప్టెంబరు 8వ తేది వరకు 11 రోజులు కోలాహలంగా జరుగుతాయి. ఉత్సవాల్లో ప్రధానంగా పతాకావిష్కరణ, సెప్టెంబరు 7న నిర్వహించే రథోత్సవంలో లక్షలాది భక్తులు పాల్గొంటారు. 8వ తేది అమ్మవారి జయంతి సందర్భంగా పట్టాభిషేక మహోత్సవం నిర్వహించి, ఆ రోజు సాయంత్రం పతాక అవనతంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతిరోజు ప్రపంచ శాంతి, దేశ ప్రగతి, అభాగ్యులు, రోగులు, విద్యార్థులు, మాతృమూర్తులు, దేశ, విదేశాల నాయకుల సంక్షేమం కోసం ప్రార్థనలు నిర్వహిస్తారు. అలాగే, ఉత్సవాల్లో రాత్రి 7 గంటలకు దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన సంప్రదాయాలతో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇస్తుంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు సుమారు రెండు వారాలు పాదయాత్రగా పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

వసతి సదుపాయం...

ఘనచరిత్ర కలిగిన ఈ ప్రార్థనాలయానికి పర్యాటకులు, భక్తుల తాకిడి బాగా పెరిగింది. సర్వమతాల వారు ఈ క్షేత్రాన్ని సందర్శించేందుకు సంవత్సరమంతా వచ్చి వెళుతుంటారు. కుటుంబాలతో వచ్చే వారికి చర్చి యాజమాన్యం నిర్మించిన గదులను తక్కువ అద్దెకు ఇస్తున్నారు. విడిది గృహం కోసం ముందస్తు బుకింగ్, సిఫారసు లేఖలు అవసరం లేదు. వ్యయప్రయాసలతో వెళ్లే భక్తుల సౌకర్యార్థం వేలాంకన్ని బస్టాండ్ సమీపంలోని రిసెప్షన్ సెంటర్ 24 గంటలు పనిచేస్తూ, భక్తులకు గదులు కేటాయిస్తుంటారు. గదుల కోసం ఆధార్ కార్డు నకలు సమర్పించాల్సి ఉంటుంది.



గోథిక్ శిల్పకళా నైపుణ్యంతో విన్‌మిన్ చర్చి

8 భాషల్లో ఆరాధన...

ప్రధాన ఆలయ వెనుకవైపున్న మందిరంలో ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు తెలుగు, 8 గంటలకు తమిళం, 9.15 గంటలకు కన్నడ, 10.45 గంటలకు హిందీ, సాయంత్రం 4 గంటలకు ఆంగ్లం, 5 గంటలకు కొంకిణి, 6 గంటలకు మలయాళం, 7 గంటలకు మరాఠి భాషల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు.



భక్తులు మోకాళ్లపై నడిచే మార్గం

ఎలా వెళ్లాలంటే..?

వేలాంకన్ని క్షేత్రానికి నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, తిరుచ్చి, కారైక్కాల్, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, మదురై, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. చెన్నై నుంచి 372 కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు మీదుగా చేరుకోవచ్చు. అలాగే, ఎగ్మూర్ రైల్వేస్టేషన్ నుంచి వేలాంకన్ని, నాగపట్టణానికి రైళ్లు నడుపుతున్నారు. ఇక, ప్రైవేటు రవాణా సంస్థలు హైటెక్ వసతులతో బస్సులు నడుపుతున్నాయి. నాగపట్టణం వరకు పలు ప్రాంతాల నుంచి రైళ్లలో వెళ్లే వారు అక్కడి నుంచి టౌన్, మినీ బస్సులు, ఆటోల్లో వేలాంకన్నికి చేరుకోవచ్చు. అలాగే, 105 కి.మీ దూరంలో తిరుచ్చి విమానాశ్రయం నుంచి కూడా రవాణా సదుపాయం అందుబాటులో ఉంది.

యాక్షన్, ఫ్యామిలీ సెంటిమెంట్‌తో అర్జున్ 'విరుందు'



'విరుందు'లో అర్జున్ - నిక్కీ గల్రానీ

యాక్షన్ కింగ్ అర్జున్ స్వల్ప విరామం తర్వాత మళ్లీ వెండి తెరపై సందడి చేస్తున్నారు. ఆయన హీరోగా నటించిన కొత్త చిత్రం 'విరుందు' గురువారం విడుదలైంది. పూర్తి యాక్షన్, ఫ్యామిలీ సెంటిమెంట్ చిత్రంగా రూపొందించిన ఈ చిత్రంలో అర్జున్ మరోమారు అద్భుతమైన యాక్షన్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. నెయ్యర్ ఫిలిమ్స్ పతాకంపై క్రిష్ నెయ్యర్ నిర్మాణ సారథ్యంలో ఈ సినిమా రూపొందింది. ఈ సినిమా గురించి దర్శకుడు కన్నన్ తామర కన్నన్ మాట్లాడుతూ, 'ఈ మూవీలో హీరోయిన్ తల్లిదండ్రులు అనుమానాస్పద రీతిలో చనిపోవడంతో హీరోయిన్‌ను వెంబడించే హంతకులు.. ఈ అంశాలను ఎంతో ఆసక్తికరమైన ఉత్కంఠకు లోనుచేసే స్క్రీన్‌ప్లేతో రూపొందించాం. అర్జున్‌తో పాటు గిరీష్ నెయ్యర్, నిక్కీ గల్రానీ, హరీష్ పేరడీ, సోనా నాయర్, అజు వర్గీర్ తదితరులు నటించారు. సినిమా మొత్తం యాక్షన్, ఫ్యామిలీ సెంటిమెంట్, థ్రిల్లర్ తరహాలో సాగుతుంది. విడుదలైన అన్ని థియేటర్లలో మొదటి ఆట నుంచే మంచి స్పందన వస్తున్నట్టు వివరించారు.

చిత్రజ్యోతి

పొన్‌రామ్ దర్శకత్వంలో షణ్ముగ పాండియన్



కొత్త చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

కోలీవుడ్‌లో హాస్యభరిత చిత్రాలను తెరకెక్కించడంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న దర్శకుడు పొన్‌రామ్... 2013లో 'వరుత్తపడాద వాలిబర్ సంఘం' అనే సినిమా నిర్మించి బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ తర్వాత 'రజినీ మురుగన్, 'సీమరాజా', 'ఎంజీఆర్ మగన్', 'డీఎస్పీ' వంటి చిత్రాలను తెరకెక్కించారు. ఈ నేపథ్యంలో దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ చిన్న కుమారుడు షణ్ముగపాండియన్ హీరోగా ఓ చిత్రానికి ప్లాన్ చేశారు. ఇందులో శరత్‌కుమార్, కాళి వెంకట్, కల్లి రాజా తదితరులు ముఖ్య పాత్రలను పోషించనున్నారు. షణ్ముగ పాండియన్ చివరగా 'మదురై వీరన్' అనే చిత్రంలో నటించారు. ప్రస్తుతం ఆయన ఆయన హీరోగా 'పడై వీరన్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కగా, వచ్చే నెలలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో పొన్‌రామ్ - షణ్ముగ పాండియన్ కాంబోలో తెరకెక్కే చిత్రంలో చిత్రంపై అధికారిక ప్రకటన తాజాగా వెల్లడైంది. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చే ఈ చిత్రం స్టార్ సినిమాస్ పతాకంపై నిర్మితంకానుంది.

హైపర్ లింక్ మూవీగా 'ఒన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్'



విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

ఫ్రైడే ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై కెప్టెన్ ఎంపీ ఆనంద్ నిర్మాణంలో, డ్రీమ్ హౌస్ హారూన్, పీజీఎస్ ప్రొడక్షన్స్ పీజీఎస్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్'. హైపర్ లింక్, నాన్ లీనియర్ మూవీగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రసాద్ మురుగన్ దర్శకుడు. భరత్, సుహైల్, రాజాజీ ప్రధాన పాత్రలు పోషించారు. హీరోయిన్లుగా 'విరుమాండి' ఫేం అభిరామి, అంజలీ నాయర్, పవిత్రా లక్ష్మి నటించారు. ఈ చిత్రం బృందం బుధవారం రాత్రి నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. నిర్మాతల్లో ఒకరైన కెప్టెన్ ఎంపీ ఆనంద్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నిర్మాణం సాఫీగా పూర్తి చేసేందుకు అన్ని రకాల వనరులు సమకూర్చాం. ఇపుడు చివరి దశ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ప్రతి ఒక్కరికీ నచ్చేలా తెరకెక్కిస్తున్నాం' అన్నారు. దర్శకుడు ప్రసాద్ మురుగన్ మాట్లాడుతూ, 'ఈ కథ విని సహకరించిన నిర్మాత ఆనంద్‌కు ధన్యవాదాలు. భరత్, అభిరామి ఇలా పెద్ద స్టార్ కాస్టింగ్. వీరంతా కథపై నమ్మకంతో నటించేందుకు ముందుకు వచ్చారు. ఇది ఒక హైపర్ లింగ్, నాన్‌లీనియర్ మూవీగా ఎంతో ఆసక్తికరంగా రూపొందించాం' అని వివరించారు. హీరో భరత్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో హీరోగా నటించాను. గత ఐదారేళ్లలో తమిళ సినిమా వేరే స్థాయికి వెళ్ళిపోయింది. ఇందులో నేను పోషించిన పాత్ర కొత్తగా ఉంది. ఇందులో నటించిన ప్రతి ఒక్క నటీనటులతో పాటు సినిమాటోగ్రఫీ, సంగీతం ఇలా ప్రతి ఒక్కటీ అద్భుతంగా కుదిరాయి. చిత్ర నిర్మాతలందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అలాగే, హీరోయిన్లతో పాటు ఇతర టెక్నీషియన్లు, నటీనటులు తమ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. ఇతర పాత్రల్లో కనిహ, తలైవాసల్ విజయ్, అరుల్ డి.శంకర్, పొర్కొడి, పీజీఎస్ కల్కి, సయ్యద్ తదితరులు నటించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లం బోధించండి

● స్పీకర్ అప్పావు



సమావేశంలో ప్రసంగిస్తున్న స్పీకర్ అప్పావు

పెరంబూర్, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాల్లో 12వ తరగతి విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడేలా శిక్షణ ఇవ్వాలని స్పీకర్ అప్పావు ఉపాధ్యాయులకు సూచించారు. తిరునల్వేలి జిల్లా పళవూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అప్పావు, 12వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను పిలిచి, ఉదయం ఏం తిన్నారు అని ఆంగ్లంలో ప్రశ్నించారు. వారికి ఆంగ్లం రాకపోవడంతో విద్యార్థినులు బిక్కమొహం వేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆంగ్లం దారాళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని, ప్రతిరోజు పాఠశాల సమయం ముగిసిన తర్వాత అరగంట సేపు స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహించాలని సూచించారు.

డిప్యూటీ సీఎంలాగే పనిచేస్తున్న ఉదయనిధి

● విద్యామంత్రి అన్బిల్ మహేష్



నాగర్‌కోవిల్ జోసెఫ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెబుతున్న మంత్రి

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి, తన చిరకాల స్నేహితుడు ఉదయనిధి ప్రస్తుతం డిప్యూటీ సీఎంలాగే పనిచేస్తున్నారని రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ కొనియాడారు. నాగర్‌కోవిల్ జోసెఫ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో గురువారం ఉదయం జరిగిన 'కాఫీ విత్ ఎడ్యుకేషన్ మినిస్టర్ (విద్యామంత్రితో కాఫీ సేవనం) అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా విద్యార్థులడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. మంత్రి ఉదయనిధితో బాల్యస్నేహం గురించి ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమ స్నేహం మూడు తరాల అనుబంధమని చెప్పారు. అన్నాదురై మృతిచెందాక తన తాతగారైన అన్బిల్ ధర్మలింగం కలైంజర్ కరుణానిధి నాయకత్వాన్ని అంగీకరించారని, అదే విధంగా కరుణానిధి నాయకత్వాన్ని తాను అంగీకరించి పార్టీకి సేవలందిస్తున్నానని చెప్పారు. కరుణానిధి మృతి తర్వాత స్టాలిన్‌ను నాయకుడిగా తన తండ్రి అన్బిల్ పొయ్యామొళి అంగీకరించారని చెప్పారు. ఈ పరిస్థితులలో యువతకు సేవలందించే ప్రధాన ప్రతినిధిలా ఉదయనిధి క్రీడా శాఖ మంత్రిగానే కాకుండా డిప్యూటీ సీఎంలాగే మంత్రులందరి శాఖలను సమన్వయపరుస్తూ వాటిని పటిష్టంగా అమలు చేస్తున్నారని అన్బిల్ మహేష్ అన్నారు. భావితరాలకు సమర్థవంతమైన నాయకుడిగా బాధ్యతలు స్వీకరించగలిగిన సత్తా సామర్థ్యం ఉదయనిధికి ఉందన్నారు.



జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన ఏడుగురు క్రీడాకారులకు చెన్నైలో తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్టు నుంచి రూ.17.45 లక్షల సాయం అందిస్తున్న మంత్రి ఉదయనిధి

ఎస్కేపీసీలో తెలుగు భాషా దినోత్సవం



విద్యార్థినులతో శరత్‌కుమార్, మోహనశ్రీ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 29: స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ) ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి 161వ జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల కరచాలకులు ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ, తెలుగు శాఖ అధ్యాపకురాలు డా.వీఎస్.మైథిలి, డా.పద్మావతి తదితరులు హాజరై తెలుగు భాష విలువలు, గిడుగు రామమూర్తి సేవలపై ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషా ప్రాముఖ్యత-వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన అక్షయ, ఉమ, ధనలక్ష్మిలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషను ప్రోత్సహించేలా కళాశాలలో తెలుగు కార్యక్రమాలను జరుపుకుంటున్నట్లు శరత్‌కుమార్ తెలిపారు.

వీనులవిందుగా సాలూరి సంగీత విభావరి



ప్యారీస్, ఆగస్టు 29: స్థానిక రాయపేటలోని గౌడియా మఠంలో శ్రీ కృష్ణ జయంతి, నందోత్సవం సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు బృందం బుధవారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. కృష్ణ భగవానుడి చరిత్రను తెలియజేసే కీర్తనలు భక్తులను అలరించాయి. వాసూరావు సారథ్యంలో సావిత్రి శివకుమార్ ఘంటసాల, కిడాండి లక్ష్మీకాంత్, మాధవి సంతోష్, మాస్టర్ శశాంక్ సంతోష్ భక్తిగీతాలు, భజన పాటలను శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను మైమరపించారు. గంటన్నర పాటు సాగిన ఈ విభావరి బృందాన్ని గౌడియా మఠం నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా వాసూరావు మాట్లాడుతూ... సంగీత దిగ్గజాలు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరు రాజేశ్వరరావు తరం నుంచి ఈ వేదిక మీద నిరంతరాయంగా సంగీత కార్యక్రమం జరిగేదని తెలిపారు. వారి తర్వాత స్వామివారి అనుగ్రహంతో 28 సంవత్సరాలుగా తన నేతృత్వంలో ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి, నందోత్సవం సందర్భంగా భక్తిసంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాయిద్య సహకారం అందించిన ఎస్.వెంకట్రావు, రమేష్, సి.సుబ్రమణ్యం, గాయనీ గాయకులు, మఠం నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నగరంలో ఈశాన్య రుతపవన ప్రభావిత వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు జీసీసీ అహ్మదాబాద్ నుంచి తెప్పించిన మురుగు కాల్వల్లో చెత్త తొలగించే డ్రెయిన్ మాస్టర్ యంత్రం